## క్లుప్తంగా

### సమస్యలను పరిష్కరించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్ :** నగర పంచాయతీ పరిధిలోని పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు కోరారు. బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో కమిషనర్ రమణబాబుకు ఆ పార్టీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేబాల కాలువపై నిర్మించిన శ్లాబును చెన్నూరు రోడ్డుకు కలుపుతూ ర్యాంప్ నిర్మించాలన్నారు. కాలువపై నిర్మించిన కాంక్రీట్ వాల్ శ్లాబుపై అక్కడక్కడా మ్యాన్‌హోల్స్ ఉన్నాయని, వాటికి మూతలు ఏర్పాటు చేయాలని తెలిపారు. చెన్నూరు రోడ్డు వద్ద ఉన్న కాలువకు ఇరువైపులా రక్షణగోడలు నిర్మించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, జానీబాషా, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

### సీహెచ్‌సీలో భోజన సదుపాయం



చికిత్స పొందుతున్న రోగికి భోజనం అందజేస్తున్న డాక్టర్ ప్రసాద్

**పొదలకూరు :** పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు ఉచితంగా భోజనం అందజేస్తున్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన సీహెచ్‌సీలో మంగళవారం మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి వచ్చి ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స పొందే వారికి భోజన సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం, రాత్రి రెండు వేళల భోజనం అందజేస్తున్నామని, డెలివరీకి వచ్చే మహిళలకు కూడా జనరల్ డైట్ కింద భోజనం పెడుతున్నట్టు చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే పేదలకు భోజన వసతి వల్ల ఎంతో ఉపయోగం ఉందన్నారు.

### అవగాహనతో డయేరియాకు చెక్

- ఈఓపీఆర్డీ డేవిడ్



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కొడవలూరు :** అవగాహనతోనే డయేరియా, మలేరియాలకు చెక్ పెట్టొచ్చని ఈఓపీఆర్డీ వి.డేవిడ్ సూచించారు. మండలంలోని మానేగుంటపాడులో డయేరియా, మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగలు ముసిరిన, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవడం, కలుషిత నీటిని తాగడం ద్వారా డయేరియా వస్తుందన్నారు. పరిశుభ్రమైన, తాజా ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా డయేరియాను పారదోలాలన్నారు. దోమల కారణంగా మలేరియా వ్యాధి వ్యాపిస్తుందని, దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.రమేష్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు తీర్మానం చేశామని, దీనిని ప్రభుత్వానికి పంపి త్వరలోనే ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీటిని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కళాజాతాలతో సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.విజయలక్ష్మి, ఉప సర్పంచ్ రాజవర్ధన్‌రెడ్డి, స్థానిక నేత బాలభాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### గడ్డివామి దగ్ధం



గడ్డిని పక్కన పెడుతున్న గ్రామస్తులు

**విడవలూరు:** మండల కేంద్రంలోని అంకమ్మ దేవాలయం వెనుక వైపునున్న గడ్డివామి దగ్ధమైంది. ఈ ఘటన మంగళవారం విడవలూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిట్టేటి కమలాకర్ అనే వ్యక్తికి గడ్డివామి ఉంది. విద్యుత్ తీగలకు చెట్టు కొమ్మలు తగిలి నిప్పురవ్వలు గడ్డివామిపై పడడంతో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారొచ్చి మంటలను అదుపు చేశారు.

# నాట్యమయూరి..

- కూచిపూడి నృత్యంలో విశేష ప్రతిభ
- భర్త, ఇద్దరు కుమార్తెలతో కలిసి ప్రదర్శనలు
- ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న జ్యోత్స్న
- కళాక్షేత్రంతో ఎంతో మందికి శిక్షణ



శిక్షణ పొందుతున్న చిన్నారులు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** నగరానికి చెందిన కూచిపూడి కళాకారిణి, నృత్య గురువు పాల జ్యోత్స్నరెడ్డి తన నృత్య ప్రదర్శనలతో విశేష ప్రతిభ చూపుతూ ఎంతో మంది ప్రశంసలను అందుకుంటున్నారు. ప్రస్తుతం దాదాపు 100 మందికి కూచిపూడిలో శిక్షణ ఇస్తూ.. నాట్య శిరోమణి, ఉత్తమ గురువుగా ఉగాది పురస్కారంతో పాటు ఎన్నో అవార్డులను సొంతం చేసుకున్నారు.

**కూచిపూడి కళాక్షేత్ర ఏర్పాటు**

నగరంలోని వేదాయపాళెంలో నివసిస్తున్న జ్యోత్స్నరెడ్డి కూచిపూడి నృత్యం నేర్చుకోవాలని చిన్నతనంలో ఎన్నో కలలుగన్నారు. అయితే కొన్ని పరిస్థితుల కారణంగా అది సాధ్యపడలేదు. శ్రీకర్‌రెడ్డితో వివాహమయ్యాక ఆయన ప్రోత్సహించారు. ఈ క్రమంలో కూచిపూడి నృత్యగురువు దేగల సాంబశివరావు వద్ద శిక్షణ పొందారు. కూచిపూడిలో సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసి నృత్యాన్ని నలుగురికి నేర్పాలనే లక్ష్యంతో వేదాయపాళెంలో నందికేశ్వర కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇక్కడ ఐదేళ్ల నుంచి 50 ఏళ్ల వరకు వారు కూచిపూడి నృత్యాన్ని నేర్చుకుంటున్నారు.

**కుటుంబసభ్యులతో కలిసి..**

జ్యోత్స్నరెడ్డితో పాటు ఆమె భర్త శ్రీకర్‌రెడ్డి, కుమార్తెలు శరణ్యారెడ్డి, వర్షికారెడ్డి కూచిపూడి నృత్య కళాకారులు కావడం విశేషం. వీరు జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇస్తూ పలువురి ప్రశంసలను పొందుతున్నారు. మరోవైపు పలు ప్రదర్శనలిస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి జ్యోత్స్నరెడ్డి గురయ్యారు. కాలుకు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. అయినా మొక్కవోని సంకల్పంతో కూచిపూడి నృత్యం చేస్తూనే పలువురికి శిక్షణ ఇస్తున్నారు.

**దేశవ్యాప్తంగా పలు ప్రదర్శనలు**

దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నందికేశ్వర కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రముఖ దేవాలయాలు, ప్రభుత్వం నిర్వహించే పలు కార్యక్రమాలు, నృత్య పోటీల్లో పాల్గొని పలు అవార్డులను సాధించారు.



కుటుంబసభ్యులతో కలిసి నృత్య ప్రదర్శనలో జ్యోత్స్నరెడ్డి



సాధించిన అవార్డులు

**కుమార్తెకు శిక్షణ ఇప్పిస్తున్నా..**



కూచిపూడి నృత్యం అంటే ఎంతో ఇష్టమున్నా, నేర్చుకోలేకపోయా. నా ఐదేళ్ల కుమార్తెకు కూచిపూడిలో శిక్షణ ఇప్పిస్తున్నా. నా కలను బిడ్డ ద్వారా సాకారం చేసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

- శ్రీలక్ష్మి, విద్యార్థి తల్లి, ఇరుగాళమ్మ గుడి సెంటర్

**నృత్యం మరుగునపడకూడదు**



ప్రస్తుతం చాలా మందికి కూచిపూడి నృత్యం అంటే తెలియదు. భారతీయ ప్రాచీన, సంప్రదాయ నృత్యాలపై పెద్దగా అవగాహన ఉండటంలేదు. కూచిపూడి నృత్యాన్ని నేటి తరం వారికి పరిచయం చేసి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యం.

- జ్యోత్స్నరెడ్డి, కూచిపూడి కళాకారిణి

**కూచిపూడి అంటే ఎంతో ఇష్టం**



కూచిపూడి నృత్యమంటే ఎంతో ఇష్టం. దీని గొప్పతనాన్ని నా ఎనిమిదేళ్ల కుమార్తెకు తెలియజేయడంతో నేర్చుకునేందుకు ఎంతో ఆసక్తి చూపింది. శిక్షణ పొందుతూ కూచిపూడి నృత్యాన్ని ఎంతో చక్కగా చేస్తోంది.

- పవన్‌కుమార్, విద్యార్థి తండ్రి

**చిన్నప్పటి నుంచే ఆసక్తి**



నా కుమార్తె ఆరో తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచే కూచిపూడి అంటే నా కుమార్తెకు ఎంతో ఇష్టం. శిక్షణ కోసం నందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రంలో చేర్పించా. నృత్యంలో చక్కగా రాణిస్తోంది.

- శివ, విద్యార్థి తండ్రి

**ఎంతో గర్వంగా ఉంది**



కూచిపూడిలో శిక్షణ పొందుతుండటం ఎంతో గర్వంగా ఉంది. కొన్ని సందర్భాల్లో నృత్య ప్రదర్శనలు చేస్తున్నాం. కూచిపూడిలో ప్రావీణ్యం సాధించి దాని గొప్పతనాన్ని చాటి చెప్తాం.

- శ్లోక

## ప్రమాదభరితంగా గుంత



**నెల్లూరు(బారకాసు):** నగరంలోని రంగనాయకులపేట రైల్వే గేట్ వద్ద గుంత ప్రమాదభరితంగా మారింది. నిత్యం ఈ ప్రాంతం మీదుగా వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ క్రమంలో స్థానిక రైల్వే గేట్ మీదుగా రైల్వేస్టేషన్‌కు మలుపు తిరిగే వద్ద రోడ్డు కుంగి పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి వేళ పలువురు వాహనదారులు పడి గాయపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తించాలి

**నెల్లూరు(అర్బన్):** ప్రాథమిక దశలో కుష్టు వ్యాధిని గుర్తించి.. అప్పుడే చికిత్స చేయిస్తే త్వరగా నయమవుతుందని ఏడీఎంహెచ్‌ఓ, జిల్లా కుష్టు నివారణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. నగరంలోని కిసాన్ నగర్, జాఫర్‌సాహెబ్ కాలువ ప్రాంతాల్లో గల అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో నిర్వహిస్తున్న లెప్రసీ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వే రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సర్వేను పక్కాగా చేపట్టాలని సూచించారు. రాగి, తెనె, నల్లటి మచ్చలుండి.. స్పర్శ లేకపోతే అలాంటి వారికి తక్షణమే పరీక్షలు చేయించాలని కోరారు. అందరూ సమన్వయంతో పనిచేసి కుష్టు నివారణ జిల్లాగా నెల్లూరును మారుద్దామని తెలిపారు. మెడికల్ ఆఫీసర్ సునీల్‌బాబు, ఏఓ సతీష్, డీపీఎంఓ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

## కేన్సర్‌పై మహిళా ఉద్యోగులకు అవగాహన



మాట్లాడుతున్న విజయన్



సదస్సుకు హాజరైన ఉద్యోగులు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** విద్యుత్ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న మహిళాధికారులు, ఉద్యోగులకు కేన్సర్‌పై అవగాహన సదస్సును ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యురాలు లక్ష్మి మాట్లాడారు. ప్రాథమిక దశలోనే కేన్సర్‌ను గుర్తిస్తే ప్రాణాపాయం తప్పుతుందని చెప్పారు. వైద్య పరీక్షలను చేయించుకోవాలని సూచించారు. ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్, రెడ్‌క్రాస్ వైద్యురాలు కన్యాకుమారి, సహాయకురాలు పంపద్మజ తదితరులు పాల్గొన్నారు.

## వేదగిరిలోని లక్ష్మీనృసింహుడి సేవలో..

**నెల్లూరు సిటీ:** నరసింహకొండలో వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, అమ్మవారిని రాష్ట్ర పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ వాణీమోహన్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయాధికారులు ఆమెను ఆహ్వానించారు. ఆశీర్వచనాలను అందజేసి చిత్రపటాన్ని బహూకరించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నెల్లూరు(బృందావనం):** నగరంలోని తల్పగిరి రంగనాథస్వామిని పురావస్తు, మ్యూజియం శాఖ కమిషనర్ వాణీమోహన్ దర్శించుకున్నారు. స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఈఓ అర్చభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



ఆలయంలో వాణీమోహన్

### మర్యాదపూర్వకంగా..

**నెల్లూరు(దర్గామిట్ట):** కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయను ఢిల్లీలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. జిల్లా పరిధిలో అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం, వారికి సంబంధించి పథకాలు తదితరాలపై మంత్రితో చర్చించారు.

**బడ్జెట్‌పై హర్షం**

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి ప్రాధాన్యమివ్వడంపై ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించడం గొప్ప విషయమన్నారు.

### రోడ్లపై గోవుల సంచారాన్ని అరికట్టాలని వినతి

**నెల్లూరు(బారకాసు):** రోడ్లపై గోవుల సంచారాన్ని అరికట్టాలని 38వ డివిజన్‌కు చెందిన బాపనపల్లి శశిధర్ కోరారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ శర్మదకు వినతిపత్రాన్ని మంగళవారం సమర్పించారు. షణ్ముకేశ్వరరావు, ధనుంజయ, సుజన్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం

**నెల్లూరు(అర్బన్):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అంబులెన్స్ అండ్ ఆక్సిజన్ బ్యాంక్ కన్వీనర్ అమర్తలూరు ప్రవీణ్‌కృష్ణ మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో 33వసారి రక్తదానం చేశారు. ప్రమాద బాధితుడికి రక్తం అవసరం కావడంతో దానం చేశానని చెప్పారు.

### కమిషనర్ బాధ్యతల స్వీకరణ నేడు



సూర్యతేజ

**నెల్లూరు(బారకాసు):** కార్పొరేషన్ కమిషనర్‌గా మల్లవరపు సూర్యతేజ బాధ్యతలను బుధవారం చేపట్టనున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలను ఉదయం 11 గంటలకు స్వీకరించనున్నారు.

### శాకంబరి అలంకారంలో పోలేరమ్మ

**మనుబోలు :** మనుబోలు కోదండరామపురం దేవాంగుల వీధిలో కొలువైన పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు మంగళవారం శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకుడు శ్రీనివాసులు పోలేరమ్మకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలన అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా నీలిశెట్టి విజయ్‌కుమార్, సుమతి దంపతులు వ్యవహరించారు.

## ప్రణాళికాబద్ధంగా పారిశుధ్య పనులు

**నెల్లూరు(బారకాసు):** నగరంలో పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అదనపు కమిషనర్ శర్మద ఆదేశించారు. పలు డివిజన్లలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆదిత్యనగర్, రామ్‌జీనగర్, చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతాల్లో చెత్తను తరలిస్తున్న నగరపాలక సంస్థ ట్రాక్టర్ల డ్రైవర్లతో మాట్లాడారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. రోడ్డు పక్కన యాచకుడి మృతదేహాన్ని గుర్తించి, పోలీసులకు సమాచారమిచ్చిన అనంతరం తరలించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సోమశేఖరపురం, పొగతోట ప్రాంతాల్లో పర్యటించారు. శానిటేషన్ అధికారులు వెంకటేశ్వర్లు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న శర్మద

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న హుస్సేనమ్మ

**నెల్లూరు (అర్బన్):** అడపాదడపా కురుస్తున్న వర్షాలకు దోమలు పెరుగుతున్నాయని, వీటి వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలను చైతన్యం చేస్తూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. నగరంలోని వైద్యశాఖ కార్యాలయంలో మలేరియా నియంత్రణాధికారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు అక్కడక్కడా బయట పడుతున్నాయన్నారు. దోమల ఉధృతి పెరగకుండా మలాథియాన్‌ను స్ప్రే చేయాలన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వాలను తినే గంబూసియా చేపలను వదలాలన్నారు. దోమల ఉత్పత్తి ఆగిపోయేలా నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. ఎక్కడైనా మలేరియా, డెంగీకి సంబంధించిన కొత్త కేసు నమోదైతే ఆ చుట్టు పక్కల 250 ఇళ్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. స్ప్రేతో పాటు బ్లీచింగ్ చల్లాలన్నారు. సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, శ్యామ్‌సన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు నెల్లూరీయులు



ప్రణయ్‌కీర్తన్

**నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట్):** రాష్ట్ర జూనియర్స్ ఫుట్‌బాల్ జట్టుకు జిల్లా క్రీడాకారులు నలుగురు ఎంపికయ్యారని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడారు. అసోంలో ఈ నెల 28 నుంచి నిర్వహించనున్న జాతీయ జూనియర్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రణయ్‌కీర్తన్ ఎంపికయ్యారని తెలిపారు. జూనియర్స్ మహిళా విభాగంలో షమిత, మధుశ్రీ సాగరిక, శ్రుతి ఎంపికయ్యారని, అనంతపురంలో ఆగస్టు మూడు నుంచి నిర్వహించనున్న జాతీయ జూనియర్ గర్ల్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారని వివరించారు.



షమిత, మధుశ్రీ సాగరిక, శ్రుతి

## ఏఎన్‌ఎం సప్లిమెంటరీ పరీక్షలు

**నెల్లూరు(అర్బన్):** ఏఎన్‌ఎం కోర్సుకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలను నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గల మీటింగ్ హాల్లో మంగళవారం నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల విద్యార్థినులు పరీక్షలు రాశారు. ఎగ్జామినర్‌గా కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ నెల 26 వరకు నిర్వహించనున్న పరీక్షలకు 110 మంది హాజరుకానున్నారని తెలిపారు.



## ఎంహెచ్‌ఓగా చైతన్యరెడ్డి

**నెల్లూరు(బారకాసు):** నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారిగా చైతన్యరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఉత్తర్వులను మంగళవారం జారీ చేసింది. ఈయన ముత్తుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. డిప్యుటేషన్‌పై నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్‌గా నియమించారు. కాగా మరో రెండు, మూడు రోజుల్లో ఆయన బాధ్యతలను చేపట్టనున్నారు.



## జీతం బిల్లు పెట్టలేదంటూ నిరసన

**నెల్లూరు(అర్బన్):** లంచమివ్వలేదనే కారణంతో తనకు జీతం బిల్లు పెట్టలేదంటూ హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ వేదాయపాళెంలోని ఆ శాఖ కార్యాలయం ఎదుట నిరసనను మంగళవారం చేపట్టారు. జీతం బిల్లు పెట్టాలంటే లంచం అడుగుతున్నారని ఆరోపించారు. దీంతో ఆ శాఖలో కలకలం రేగింది. అనంతరం అధికారులు జోక్యం చేసుకొని సర్ది చెప్పడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై హౌసింగ్ కార్పొరేషన్ పీడీ దయాకర్‌ను సంప్రదించగా, ఎవరి జీతాలను ఆపలేదన్నారు. ఇన్‌కమ్ ట్యాక్స్ వివరాలను ఫిబ్రవరిలోపు ఆ ఏఈ పంపాల్సి ఉండగా, పంపలేదన్నారు. ట్యాక్స్ వివరాలను ఆలస్యంగా పంపారని, ఈ కారణంగా ఈ నెల ఏడున జీతాల బడ్జెట్ పంపామన్నారు. త్వరలోనే జీతం వస్తుందన్నారు. ఇందులో కార్యాలయాధికారుల పాత్ర ఏమీలేదన్నారు.

**హౌసింగ్ కార్పొరేషన్లో లుకలుకలు**

ఈ ఘటనతో ఆ శాఖలోని లుకలుకలు మరోసారి చర్చకు దారి తీశాయి. ఇప్పటికే హౌసింగ్ కార్పొరేషన్‌పై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకే కాంట్రాక్టర్‌కు పలు మండలాల్లో పెద్ద ఎత్తున పక్కా ఇళ్ల నిర్మాణాల బాధ్యతలు అప్పగించి కొంత మంది ఏఈలు కమీషన్లు దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తీసుకున్న కమీషన్లలో పైస్థాయి అధికారులకు వాటాలిస్తున్నారనే విమర్శలు జోరందుకున్నాయి. లంచాలు తీసుకోకుండా, వాటాలివ్వని వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే జీతాల బిల్లులను సకాలంలో పెట్టడం లేదంటూ ఆ శాఖ ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా నిబంధనల ప్రకారం వ్యవహరించి తమను ఇబ్బంది పెట్టొద్దని కొంత మంది ఉద్యోగులు కోరుతున్నారు.

## శానిటేషన్ విభాగాధికారులతో సమావేశం

**నెల్లూరు(బారకాసు):** వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో నగరంలో పారిశుధ్య పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని అదనపు కమిషనర్ శర్మద పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరపాలక సంస్థ శానిటేషన్ విభాగాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలోని అన్ని ప్రధాన రోడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు గృహాల యజమానులను గుర్తించి వారి ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సూచనలివ్వాలని కోరారు. అన్ని కాలువల్లో పూడికతీత, మురుగు తొలగింపు పనులను రోజూ చేపట్టాలని ఆదేశించారు. చెత్తను తీసుకెళ్లే వాహనాల నుంచి వ్యర్థాలు రోడ్డుపై పడకుండా సరైన విధానం ద్వారా తరలించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై సమాచారం, చికిత్స, ఇతర వివరాల కోసం 0861 2316777 నంబర్‌లో సహాయక సిబ్బందిని అందుబాటులో ఉంచామని తెలిపారు.

